సాక్షి తిరుపతి

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



టీటీడీ మెరుగైన వైద్యం

టీటీడీకి సంబంధించి బర్డ్, శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారని గవర్నర్ కొనియాడారు. - 8లో



నేడు పాలిసెట్

పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధమైనట్టు సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ నిర్మల్‌కుమార్‌ప్రియ తెలిపారు. - 8లో



50 నామినేషన్ల తిరస్కరణ

జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల సెగ్మెంట్లలో 50 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్టు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర గవర్నర్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట రైల్వేస్టేషన్‌లో రాష్ట్ర గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

రేణిగుంట: తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం తిరుగుపయనమైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం రేణిగుంట రైల్వే జంక్షన్‌లో సాదర వీడ్కోలు లభించింది. ఆయనకు రైల్వేస్టేషన్‌లో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు తదితరులు వీడ్కోలు పలికారు. ఆయన రైల్లో విజయవాడకు బయల్దేరి వెళ్లారు.

వైభవంగా శుక్రవార ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవార ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురు వారం అర్ధరాత్రి వరకు 61,492 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,660 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 2.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నిష్పక్షపాతంగా సార్వత్రిక ఎన్నికలు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: పారదర్శకంగా.. నిష్పక్షపాతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌తోపాటు పరిశీలకులు కరీగౌడ ఐఏఎస్, ఉజ్వల్ కుమార్ ఘోష్, అరవింద్ సాల్వే, జిల్లా జేసీ ధాన్యచంద్‌తో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిష్పాక్షపాతంగా సమన్వయంతో ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధత పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్‌తోపాటు ఈఆర్వోలు అదితిసింగ్, నిషాంత్ రెడ్డి, చంద్రముని , కిరణ్‌కుమార్, రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

పాలారుకు చంద్రగ్రహణం!

టీడీపీ అధినేత చంద్రబాబులో పెరిగిన కీర్తి కండూతికి కుప్పం వాసులు బలయ్యారు. దశాబ్దాలుగా మోసిన ప్రజల తాగు.. సాగునీటి కష్టాలను తీర్చే పాలారు ప్రాజెక్టుకు ఘనత వహించిన బాబుగారు గ్రహణం పట్టించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారనే కారణంతో పనులకు మోకాలడ్డారు. ఇది పూర్తయితే తన అడ్డాలో వైఎస్సార్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందనే అక్కసుతో కుతంత్రాలకు తెరదీశారు. తమిళనాడులోని రాజకీయ పార్టీలతో కుమ్మక్కై సొంత నియోజకవర్గం గొంతు కోశారు. 35 ఏళ్లపాటు గెలిపించిన జనాలకు ద్రోహం చేస్తూ పాలారు ప్రాజెక్టు ఊసే లేకుండా చేశారు. సస్యశ్యామలమై సిరులు కురిపించాల్సిన నేలను బీడు భూమిగా తయారు చేశారు.

- కుప్పం ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన చంద్రబాబు
- సాగు..తాగునీటి కష్టాలకు ఆయనే కారణం
- తమిళ పార్టీలతో కుమ్మక్కై సొంత నియోజకవర్గంపైనే విషం
- ఇప్పటికీ ప్రాజెక్టు పనులను పట్టించుకోని వైనం

ప్రాజెక్టు నిర్మాణానికి ఎంపిక చేసిన ప్రాంతం



అపోహలు సృష్టించి!

పాలారు ప్రాజెక్టును వైఎస్సార్ నిర్మిస్తే కుప్పంలో తన పరపతి తగ్గిపోతుందని, రాజకీయంగా బలహీన పడతామనే ఈర్ష్యతో చంద్రబాబు తమిళనాడులోని కొన్ని రాజకీయ పార్టీలతో కుమ్మక్కయ్యారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమిళనాడులో నీటి సమస్యలు తలెత్తుతాయని అపోహలు సృష్టించారు. తమిళులు ఆందోళనలు చేపట్టేలా రెచ్చగొట్టారు. ప్రోత్సహించారు. తమిళనాడులోని పాటాలి మక్కల్ కచ్చి అధ్యక్షుడు రాందాస్‌తో చంద్రబాబు చేతులు కలిపి భారీగా నిరసనలు, ఆందోళనలకు పథకం వేసి అమలు చేశారు. అలాగే అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు సైతం చంద్రబాబు లేఖ రాసినట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికీ ప్రాజెక్టు నిర్మించి తీరాల్సిందే అని వైఎస్సార్ పట్టుబట్టారు. అధికారులతో ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే చంద్రబాబు, రాందాస్ సంయుక్తంగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అటవీశాఖ అనుమతులు లేవని పిటిషన్ వేసి పాలారుకు గ్రహణం పట్టించారు.

కుప్పం : నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవమంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి చేసింది శూన్యం. 35 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహించినా ఇక్కడి నీటి సమస్యను తీర్చలేకపోయారు. బూటకపు మాటలు, హామీలతో కుప్పంవాసులను బురిడీ కొట్టించడమే తప్ప చేసిందేమీ లేదు.

ప్రాజెక్టుకు జీవం పోసిన వైఎస్సార్

కర్ణాటకలోని బేతమంగళం నుంచి కుప్పం మీదుగా తమిళనాడుకు ప్రవహించే పాలారు నదిపై ప్రాజెక్టు నిర్మించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. కరువు ప్రాంతమైన కుప్పం నియోజకవర్గం తాగు, సాగునీటి అవసరాలను తీర్చాలని నిర్ణయించారు. ఈ మేరకు 2007లో ప్రాజెక్టు నిర్మాణానికి గణేష్‌పురం వద్ద స్థలం ఎంపిక చేశారు. రూ.52 కోట్లు మంజూరు చేశారు. 0.60 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా డీపీఆర్ రూపొందించారు. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. దీంతో కాంట్రాక్టర్లు మిషనరీ, ఇతరత్రా సామాగ్రిని సైతం ప్రాజెక్టు నిర్మాణ స్థలం వద్దకు చేర్చారు. ఇక శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తారనగా సన్నివేశంలోకి స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు ప్రవేశించారు. తన సొంత నియోజకవర్గంలో వైఎస్సార్‌కు పేరు వస్తుందని కుట్ర చేసి మరీ ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందేది. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాల దాహార్తి తీరేది. అయితే కేవలం స్వార్థ రాజకీయాలే తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టని చంద్రబాబు పన్నాగాలకు కుప్పం నియోజకవర్గం ఇక్కట్ల పాలైంది.

మళ్లీ ఊపిరి పోసిన సీఎం వైఎస్ జగన్

ఇటీవల కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ పాలారుకు ఊపిరి పోశారు. ప్రాజెక్టు నిర్మాణానికి పాలనపరమైన అనుమతులతోపాటు రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. వైఎస్సార్ శ్రీకారం చుట్టిన ప్రాజెక్టును తప్పకుండా పూర్తిచేస్తామని కుప్పం నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు.

బాబు వల్లే ప్రాజెక్టు ఆగింది



పాలారు నదిపై ప్రాజెక్టు నిర్మాణానికి 20 ఏళ్ల క్రితం అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కేవలం చంద్రబాబు కారణంగా ఆ పనులు ఆగిపోయాయి. ఆ ప్రాజెక్టు కట్టి ఉంటే మాకు ఇప్పుడు నీటి సమస్యలే ఉండేవి కావు. వైఎస్ రాజశేఖరరెడ్డిపై ఈర్ష్యతోనే చంద్రబాబు ఇలాంటి పనులకు తెగబడ్డారు. కుప్పం ప్రజలపై ఆయన చూపించేది కపట ప్రేమే. ఇక చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదు. – వెంకటేష్, గిడ్డేగానిపెంట, కుప్పం మండలం

పిల్లల భవిష్యత్ బావుండేది



సుమారు 35 ఏళ్లుగా చంద్రబాబును చూస్తున్నాం. ఏవేవో మాయమాటలు చెప్పి మమ్మల్ని మోసం చేస్తూనే ఉన్నారు. ఇన్నేళ్లలో కనీసం ప్రజలకు తాగడానికి నీరు కూడా ఇవ్వలేదు. ఆయన ఇవ్వరు.. వేరే ఎవరైనా ఇస్తామంటే అడ్డుపడతారు. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పాలారు ప్రాజెక్టు కడతారని ఎంతో ఆశించాం. పక్కనే మా గ్రామం ఉండడంతో ఇక నీటి ఇక్కట్లు పోయినట్టే అని సంతోషించాం. అయితే ఆ పనులను కూడా చంద్రబాబే అడ్డుకున్నారు. ఈ ప్రాజెక్టు వచ్చి ఉంటే మా పిల్లల భవిష్యత్ ఎంతో బావుండేది.

– రామకృష్ణప్ప, ఓటికుంట, కుప్పం మండలం

బాబు పట్టించుకోలేదు



పాలారు ప్రాజెక్టును చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్టు కార్యరూపం దాల్చగానే ఆయన తట్టుకోలేకపోయారు. ఇక్కడ వైఎస్సార్‌కు పేరు వస్తుందో అని కక్షగట్టి తమిళనాడు వాళ్లతో కలిసి పనులు ఆపివేయించారు. ఇప్పుడు కూడా ఆయనకు పాలారు ప్రాజెక్టు నిర్మాణం ఇష్టం లేదు. ఇది కట్టినా వైఎస్సార్‌కే పేరు వస్తుందనే భావిస్తున్నారు. కుప్పం ప్రజలకు నిజంగా అన్యాయం చేస్తున్నారు.

– వెంకటేష్, చింతాయప్పకొటాలు

నీటికి అడ్డుపడడం సరికాదు



ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుపడిన చంద్రబాబు, ఇక కుప్పం నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేస్తారు. ఇక్కడి వాళ్లకి మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి ఆయన బాగా అలవాటు పడ్డారు. అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఈ 20 ఏళ్లలో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయేవి. చంద్రబాబు తన స్వార్థం కోసం కుప్పం ప్రజలు, రైతులను సర్వనాశనం చేశారు.

– గణేష్, కౌసిగానిపల్లి, కుప్పం మండలం

సంస్కృత భాషకు రాయబారులు యువతే



ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్స్ అందుకుంటున్న విద్యార్థి

- భాషా పరిరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం
- సంస్కృతంతో ఆధ్యాత్మిక ప్రశాంతత, మానసిక బలం
- భాషపై పరిశోధనలను ప్రోత్సహించాలి
- భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్
- 9 మందికి విశిష్ట గోల్డ్‌మెడల్స్ అందజేత

తిరుపతి సిటీ: సంస్కృత భాషకు యువత రాయబారులుగా మారి భావితరాలకు అందించాలని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీలో జరిగిన 3వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తిరుమల శ్రీనివాసుని సేవా భాగ్యం కలగడం అదృష్టమన్నారు. పరమాత్మునికి మరింత దగ్గరగా ఉన్నామనే భావన కలిగిందని, దేశ ప్రజల క్షేమం కోసం భగవంతుడ్ని ప్రార్థించానని తెలిపారు. శేషాచల పర్వతాల మధ్య నిర్మలమైన వాతావరణంలో నెలకొన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దేశ ఆధ్యాత్మిక వారసత్వానికి చిహ్నమన్నారు. సనాతన విజ్ఞాన ప్రచారంలో సంస్కృత వర్సిటీ కృషి అభినందనీయమన్నారు. సంస్కృతంతో ఆధ్యాత్మిక ప్రశాంతత, మానసిక బలం కలుగుతుందన్నారు. ఆధునిక విద్యా విధానాల అవసరాలకు, సంస్కృత వారసత్వానికి మధ్య అంతరాన్ని తగ్గించేందుకు వినూత్న పాఠ్యాంశాలు రావాలని సూచించారు. వర్సిటీలో కొత్త పాఠ్యాంశాల అభివృద్ధి, పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సంస్కృతం వారసత్వ సంపదని, మనల్ని దైవిక మార్గంలో నడిపే శక్తి భాషకు ఉందని తెలిపారు. వారసత్వానికి మూలమైన సంస్కృతం మన దైనందిన జీవితంలో మరింత పెరగాలని సూచించారు. వైద్యం, నాటకం, సంగీతం, విజ్ఞానం వంటి అంశాల్లో సంస్కృతానిది కీలక పాత్రని కొనియాడారు. ప్రధాన విద్యా స్రవంతిలో సంస్కృతం భాగం కాకపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇందుకు వలసవాద మనస్తత్వమే కారణమని, ఈ పరిస్థితిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కులపతి ఎస్.గోపాలస్వామి మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. పలు కోర్సులలో ప్రతిభ చూపిన 9 మంది విద్యార్థులకు భారత ఉప రాష్ట్రపతి చేతులు మీదుగా బంగారు పతకాలు, నగదు బహుమతులను అందజేశారు. భారత ఉప రాష్ట్రపతి దంపతులను వర్సిటీ అధికారులు జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వర్సిటీ వార్షిక రిపోర్టును వివరించారు. వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా 67 మందికి గోల్డ్‌మెడల్స్, 47 మందికి పీహెచ్‌డీ, 580మందికి డిగ్రీ పట్టాలు వర్సిటీ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసర్ డైరెక్టర్ సంతను భట్టాచార్య, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాల మెనూ.. ఇష్టంగా తిను!



రుయాలో రోగుల డైట్ మెనూ, ధరలు

గతంలో ఇలా..

ఉడికీ ఉడకని అన్నం. చాలీచాలని నీళ్ల సాంబారు.. పులిచిపోయి, పాచి వాసన వచ్చే కర్రీ. అదీ ఎప్పుడు పెడతారో.. రోగికి ఎప్పుడు వడ్డిస్తారో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో సహాయకులు ఆస్పత్రిలో పేషన్స్‌ను వదిలి హోటళ్ల చుట్టూ తిరిగేవాళ్లు. అధిక ధరలు వెచ్చించి ఆహార పదార్థాలు కొనుగోలు చేసేవారు. ఆస్పత్రుల ఖర్చులకు తోడు సహాయకుల తిండి ఖర్చు తడిసి మోపెడయ్యేది. అందుకే చాలామంది జబ్బు నయంకాకపోయినా ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యేవారు. ఇచ్చే అరకొర సొమ్ముతో రోగులకు సరిపడా తిండిపెట్టలేక సంబంధిత క్రాంట్రాక్టర్లు సైతం తలలు పట్టుకునేవారు.

ఇప్పుడు ఇలా..

నాణ్యమైన వేడివేడి భోజనం.. రుచికరమైన కూరలు, జబ్బును బట్టి రోగికి హైప్రొటీన్ వంటకాలు, డ్రైఫ్రూట్స్, పండ్లు, పాలు, రాగి జావ, చపాతీ, గుడ్డు, చిక్కీలు, అబ్బో..! ఒకటా రెండా స్టార్ హోటళ్ల మాదిరిగా రోగికి సకల వంటకాలు అందిస్తున్నారు. నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారు. ఆస్పత్రిలో రోగి ఎన్నిరోజులు ఉంటే అన్నిరోజులు పోషకాలతో కూడిన వంటకాలు వడ్డిస్తున్నారు. ఇందులోనే రోగుల సహాయకులూ సర్దుకుంటున్నారు. డైట్ చార్జీలు పెంచడంతో కాంట్రాక్టర్లు సైతం ఉత్సాహంగా పనిచేస్తున్నారు. వైద్యాధికారులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ నాణ్యమైన డైట్ అందించేలా చర్యలు చేపడుతున్నారు.

- ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ డైట్
- వ్యాధులు బట్టి రోగులకు ప్రత్యేక పోషకాహారం
- రుయాలో డైట్ రెట్టింపు
- గతంలో ఒకరికి రూ.36, ప్రస్తుతం రూ.72కు పెంపు
- గర్భిణులకు రూ.100
- సీఎం జగన్ నిర్ణయంతో నాణ్యమైన ఆహారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రోగులు

జిల్లా సమాచారం

రుయాలో ఓపీ సేవలు : 1,200–1,400
అడ్మిషన్లు : 150–170
మెటర్నటీ ఆస్పత్రిలో ఓపీలు : 270–300
అడ్మిషన్లు : 120–150

ఏరియా ఆసుపత్రుల్లో..

చంద్రగిరి ఓపీ: 150–160
అడ్మిషన్లు : 20–25
శ్రీకాళహస్తి ఓపీ : 170–190
అడ్మిషన్లు : 25–30
గూడూరు ఓపీ : 90–100
అడ్మిషన్లు : 10–20

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం రోగులకు కార్పొరేట్ వైద్యంతోపాటు అవసరమైన సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తోంది. మధ్యాహ్న భోజన పథకానికి వెచ్చించిన విధంగానే పేద రోగులకూ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. రాయలసీమ పెద్దాసుపత్రిగా పేరుగాంచిన రుయాతో పాటు జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల్లో గడచిన ఏడాదిగా స్పెషల్ డైట్ విధానం అమలుచేస్తోంది. ఈ మెనూ పట్ల రోగులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఆకలి కేకలు

గత పాలకుల నిర్లక్ష్యం పేద రోగులను తీవ్రంగా వేధించేది. సరైన వైద్యం అందక .. చాలీచాలని నాణ్యత లేని ఆహారంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో కేవలం బ్రేక్ ఫాస్ట్, బ్రెడ్‌తోనే రోగులు ఆకలి తీర్చుకోవాల్సి వచ్చేది. అరకొర ఆహారంతోనే కడుపు మాడ్చుకునేవారు. అర్ధాకలితో చికిత్స పొందే రోగులు వ్యాధి నయంపైనా ప్రభావం పడేది. దీనిపై సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. గత ఏడాది ఏప్రిల్ 16వ తేదీ నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ రతహాలో మెరుగైన వైద్యంతోపాటు సంపూర్ణ డైట్ అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం బ్రెడ్‌ను తొలగించి ఆ స్థానంతో రోగి చికిత్స పొందే అన్ని రోజులూ రోజుకొక రకం టిఫిన్ వడ్డిస్తున్నారు. గతంలో మూడు పూటలకు కలిపి ఒక గుడ్డు ఇచ్చేవారు. ప్రస్తుతం రోగికి మూడు పూటలా గుడ్లు అందిస్తున్నారు. గర్భిణులకు అధనంగా చిక్కీలు, రాగి మాల్ట్‌ను డైట్‌లో చేర్చారు. టీబీ, ఎయిడ్స్, మానసిక రోగులకు హైప్రోటీన్ డైట్‌ను వడ్డిస్తున్నారు.



రుయా ఆస్పత్రిలో రోగులకు భోజనాలను వడ్డిస్తున్న సిబ్బంది

గత ప్రభుత్వ హయాంలో...

రోగికి రోజుకు మూడు పూటలా : రూ.36
బ్రేక్ ఫాస్ట్ : బ్రెడ్, మిల్క్
లంచ్ : రైస్, సాంబార్, కర్రీ, ఎగ్–1, అరటిపండు, మజ్జిగ
రాత్రి భోజనం: రైస్, సాంబార్, కర్రీ, మజ్జిగ

ప్రస్తుత ప్రభుత్వంలో డైట్, మెనూ ధరలు

రోగికి రోజుకు మూడుపూటలా : రూ.72
ఉదయం బ్రేక్ ఫాస్ట్ : ఉప్మా, కిచిడీ, ఇడ్లీ, పొంగలి, ఎగ్–1
మధ్యాహ్న భోజనం : రైస్, సాంబారు, టమాటా పప్పు, కర్రీ, సంగటి (డయాబెటిక్), అరటిపండు, మజ్జిగ, డ్రైఫ్రూట్స్, చపాతి (డయాబెటిక్), ఎగ్–1
రాత్రి:
రైస్, సాంబార్, టమాటా పప్పు, కర్రీ, సంగటి (డయాబెటిక్), అరటి పండు, మజ్జిగ, డ్రైఫ్రూట్స్, చపాతి (డయాబెటిక్), ఎగ్–1

గర్భిణులకు స్పెషల్

గర్భిణులకు రోజుకు : రూ.100
పై మెనూతో పాటు అదనంగా చిక్కీలు, రాగి జావ అందిస్తారు. అలాగే టీబీ, ఎయిడ్స్, మానసిక రోగులకు హై ప్రోటీన్‌డైట్‌ను అందిస్తున్నారు.

గతంలో బయట నుంచి తెచ్చుకునేవాళ్లం



నా భర్త, కూతురు అనారోగ్యం కారణంగా రుయాలో చికిత్స పొందుతున్నారు. 29 రోజులుగా ఇక్కడే ఉన్నాము. మాది పలమనేరు. అక్కడి నుంచి వైద్యం కోసం ఇక్కడికి వచ్చాము. ప్రతి రోజూ సమయానికి మూడు పూటలా మంచి ఆహారాన్ని అందిస్తున్నారు. మూడు పూటలా కోడిగుడ్లు పెడుతున్నారు. అరటి పండు, చిక్కీలు, రోజుకో రకం సాంబారు, టిఫిన్ ఇస్తున్నారు. గతంలో అనేక మార్లు ఈ ఆసుపత్రికి వచ్చాము. ప్రతి సారీ బయటి నుంచి ఆహారం తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితిలేదు.

– మేనక, రోగి అటెండర్, పలమనేరు

28న వెంకటగిరికి సీఎం జగన్

- సభా స్థలి పరిశీలన



సభా స్థలిని పరిశీలిస్తున్న తలశిల రఘురాం, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 28న సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వెంకటగిరి రానున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలసిల రఘురాం, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలసి వెంకటగిరిలో సభాస్థలిని పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 28న హెలికాప్టర్ ద్వారా వెంకటగిరికి చేరుకుంటారన్నారు. ఆ తర్వాత రోడ్డు మార్గం ద్వారా పట్టణంలోని త్రిభువని సెంటర్ వద్ద బస్సుపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనంజయరెడ్డి, నెల్లూరు మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, బీసీ నేత డాక్టర్ మస్తాన్‌యాదవ్, పట్టణ కన్వీనర్ జీ.ఢిల్లీబాబు, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్లుగీత కార్మికుడి మృతి


మృతి చెందిన గోపాల్

దొరవారిసత్రం : తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న రాపూరు గోపాల్(46) ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఘటన శుక్రవారం కలగుంట గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. కలగుంట ఎస్టీ కాలనీకి చెందిన గోపాల్ ముప్పై ఏళ్లుగా కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున గ్రామ సమీపంలోని ఓ తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత, హస్తకళలను ఆదరించండి


చేనేత హస్తకళా మేళాను ప్రారంభిస్తున్న శిల్పారామం ఏవో

తిరుపతి కల్చరల్: మన సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే చేనేత వస్త్రాలు, హస్తకళలను అదరించి ప్రోత్సహించాలని శిల్పారామం ఏవో ఖాదర్‌వల్లి పిలుపు నిచ్చారు. సంస్కృతి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఖాదీ కాలనీలోని శివశక్తి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా మేళాను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్కృతి కల్చరల్ క్రాఫ్ట్ సొసైటీ కార్యదర్శి మహేష్ పైడి మాట్లాడుతూ తిరుపతి వాసులకు మన్నికైనా, ఆధునాతననమైన డిజైన్లలతో కూడిన చేనేత వస్త్రాలు, హస్తకళలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. 18 రోజుల పాటు సాగే ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది కళాకారులు తమ ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు విక్రయాలు చేయడం జరుగుతుందన్నారు. మేళాలో జైపూర్ బెడ్‌షీట్స్, సహరంగపూర్, ఉత్తరప్రదేశ్ చెక్కలతో కూడిన గృహాలంకరణ వస్తువులు, కలంకారి చీరలు, మీరట్ చెప్పులు, కొండపల్లి బొమ్మలు, చేనేత కాటన్‌షర్ట్స్, టాప్స్, డ్రెస్ మెటీరియల్స్ వంటి అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

పొత్తులతో చంద్రబాబు చిత్తే!

- ప్రపంచ రాజకీయాలకే ఆదర్శం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- రాష్ట్ర ప్రజలంతా మళ్లీ సీఎంగా జగనన్ననే కోరుకుంటున్నారు
- చంద్రబాబుకు ఈ ఎన్నికలే చివరి ఎన్నికలు
- తిరుపతి 19, 22, 25 డివిజన్లలో జోరుగా ఎమ్మెల్యే భూమన ప్రచారం


తిరుపతి 19వ డివిజన్ ఎంఆర్‌పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: '14 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు పేదలకు చిన్నపాటి మేలు చేశానని చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది. అధికార దాహంతో పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చారు. అప్పటి నుంచి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు ఏనాడైనా మంచి చేయలేదు. పెత్తందారులకు కొమ్ముకాయడం, పొత్తులతో ప్రజలను వంచించడం తప్ప ఆయన చేసిందేమీ లేదు. ఆయనకు ఇవే చివరి ఎన్నికలు' అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. నగరంలోని 19, 22, 24 డివిజన్లలో శుక్రవారం కార్పొరేటర్లు ఆరణి సంధ్య, పైడి సునీత, డిష్ చంద్ర, అడ్వకేట్ చంద్ర ఆధ్వర్యంలో ఆయన మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం భూమన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన వందల హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చావా బాబు..? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చి ధైర్యంగా ఓట్లు అడిగే పరిస్థితి లేదన్నారు. సింగిల్‌గా ఎన్నికల్లో గెలవలేమన్న భయంతో జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్న పిరికి వ్యక్తి చంద్రబాబు అన్నారు. పొత్తులతోనే చంద్రబాబు పతనం మొదలైయిందని స్పష్టం చేశారు. చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రతిపేదవాడికి అనేక సంక్షేమ పథకాలు అందించి జనరంజక పాలన అందించిన జగనన్న వైపే ప్రజలంతా ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్నను సీఎంగా చేసుకోవడానికి రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

అభినయ్‌కి లక్ష ఓట్ల మెజారిటీ ఖాయం

తిరుపతిలో భూమన అభినయ్ చేసిన అభివృద్ధిని ప్రతిఒక్కరూ స్వాగతిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో అభినయ్‌ని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవడానికి తిరుపతి నగర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే భూమన తెలిపారు. కూటమి అభ్యర్థిని తిరిగి చిత్తూరుకు పంపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, కంకనాల రమేష్, పార్టీ నాయకులు మబ్బు నాదమునిరెడ్డి, తోబాకు దనంజయులురెడ్డి, డిష్ చంద్ర పాల్గొన్నారు.

సూళ్లూరుపేట, గూడూరు పరిశీలకుల నియామకం


గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ అదనపు పరశీలకులు దువ్వూరు బాలచంద్రారెడ్డి


సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గ అదనపు పరశీలకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి దువ్వూరు బాలచంద్రారెడ్డిని, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి అదనపు పరిశీలకులుగా నియమితులయ్యారు. అలాగే వెంకటగిరి అసెంబ్లీ నియోజవర్గానికి చెందిన కలిమిలి రాంప్రసాద్‌రెడ్డిని సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజవర్గానికి అదనపు పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించింది.

నేటి పాలిసెట్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు
- 10 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతి
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ


పాలిసెట్-2024 పరీక్ష నిర్వహణపై సూచనలిస్తున్న ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం పాలిసెట్ నిర్వహించనున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు తిరుపతి జిల్లాకు సంబంధించి తిరుపతిలో 8, గూడూరులో 6, మొత్తం 14 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ ఏ.నిర్మల్‌కుమార్ ప్రియ తెలిపారు. పాలిసెట్‌కు సంబంధించి శుక్రవారం తిరుపతిలోని 8 కేంద్రాలను జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఆర్‌వీ రమణకుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాలిసెట్ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రాల్లో బల్లలు, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

తిరుపతి జిల్లాలో 5,119మంది విద్యార్థులు

తిరుపతిలో 8 కేంద్రాల్లో 3,972మంది, గూడూరులో 6కేంద్రాల్లో 1,147మంది, మొత్తం 5,119మంది విద్యార్థులు తిరుపతి జిల్లా నుంచి పాలిసెట్‌కు హాజరుకానున్నట్లు ఆర్జేడీ తెలిపారు. ఆయా కేంద్రాల్లోకి ఉదయం 9.30 గంటలకల్లా విద్యార్థులు చేరుకోవాలని, 10గంటల నుంచే విద్యార్థులను అనుమతిస్తామన్నారు. సెల్‌ఫోన్లు, క్యాలికులేటర్లు, స్మార్ట్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని తెలిపారు. తప్పనిసరిగా ఒరిజినల్ హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, ఏదేని ఫొటో కలిగిన గుర్తింపు కార్డు, బాల్ పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిళ్లు, ఇరేజర్, షార్పనర్ వెంట తీసుకురావాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని, దీనిని గుర్తుంచుకుని విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. అంతకుముందు పరీక్ష నిర్వహణాధికారులతో సమావేశమై ఆర్జేడీ తగిన సలహాలు అందజేశారు.

50 నామినేషన్ల తిరస్కరణ

జిల్లా సామాచారం

నియోజకవర్గం	వచ్చిన నామినేషన్లు	అంగీకరించినవి	తిరస్కరించినవి
తిరుపతి పార్లమెంట్	27	24	03
గూడూరు అసెంబ్లీ	21	15	06
సూళ్లూరుపేట అసెంబ్లీ	16	14	02
వెంకటగిరి అసెంబ్లీ	17	10	07
చంద్రగిరి అసెంబ్లీ	43	26	17
తిరుపతి అసెంబ్లీ	52	48	04
శ్రీకాళహస్తి	27	23	04
సత్యవేడు	24	17	07
మొత్తం	227	177	50

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఈ క్రమంలో శుక్రవారం ఆయా ఆర్వోల పరిధిలో నామినేషన్ల పరిశీలన చేపట్టారు. ఒక్కో అభ్యర్థి రెండు నుంచి మూడు సెట్ల వరకు నామినేషన్లు వేశారు. ఈ క్రమంలో పార్లమెంట్‌కు 27, అసెంబ్లీకి 200 మంది నామినేషన్లు వేశారు. పార్లమెంట్‌కు సంబంధించి 27లో మూడు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అలాగే అసెంబ్లీకి సంబంధించి 200 నామినేషన్లకుగాను 47 నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. ఇందులో మొత్తం 153 నామినేషన్లు మిగిలియి. ఆ మేరకు వారంతా బరిలో ఉంటారు. అయితే ఈ నెల 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ నేపథ్యంలో తుది జాబితా విడుదల కానుంది.

నామినేషన్ల పరిశీలన

జిల్లా పరిధిలోని తిరుపతి పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నామినేషన్లు ఆయా ఆర్వోల నేతృత్వంలో శుక్రవారం పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసిన నేపథ్యంలో శుక్రవారం పరిశీలన చేపట్టారు. ఈ నెల 29వ తేదీన ఉపసంహరణ ఉంటుంది. ఎన్నికల ఆదేశాల మేరకు పూర్తి వివరాలతో నామినేషన్లు ఉన్నాయా లేదా అనే అంశాలను నిశితంగా పరిశీలించారు. తిరుపతి పార్లమెంట్‌కు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వో, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఆయా పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్, డీఆర్వో పెంచల కిషోర్ పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతికి సాదర స్వాగతం


రేణిగుంట విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

రేణిగుంట: భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. తిరుపతి పర్యటన నిమిత్తం ఉదయం 9.58 గంటలకు ఆయన కుటుంబ సమేతంగా చేరుకోగా, విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వాగతం పలికారు. ఇంకా సీఐడీ అడిషనల్ డీజీపీ సంజయ్, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఉప కులపతి జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ప్రోటోకాల్ ఎస్‌డీసీ భాస్కర్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన 10.05గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

సాదర వీడ్కోలు

తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీ మూడవ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి అక్కడి కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 4.15గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, పలువురు అధికారులు సాదర వీడ్కోలు పలికారు.

వైఎస్సార్‌సీపీలో వంద కుటుంబాల చేరిక


ఏర్పేడు : టీడీపీ నేతలకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



గూడూరు: నెర్నూరులో పార్టీలో చేరిన వారితో మేరిగ మురళీధర్, నరేంద్రరెడ్డి

గూడూరు రూరల్: గూడూరు రూరల్ ప్రాంతాల్లోని గొల్లపల్లి, నెర్నూరు గ్రామాలకు చెందిన సుమారు వంద కుటుంబాలు పార్టీ సీనియర్ నాయకులు యద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పిపార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ బూదరు గురవయ్య, యువజన రాష్ట్ర కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, 24 సొసైటీ అద్యక్షులు అట్ల శ్రీనివాసులరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, దేగ పూడి కృష్ణారెడ్డి, జనార్దనరెడ్డి, కందలి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, మహేంద్ర, దయాకర్, స్థానిక నాయకులు కత్తి రమణయ్య, సుబ్బమ్మ, వెంకటయ్య, కొమ్మల రమణయ్య, క్రిష్ణయ్య, రత్నయ్య, సూరాబత్తిన పెంచలరావు, దాసరి వినోద్‌కుమార్, శ్రీనివాసులు చిట్టబాబు, జయరామయ్య పాల్గొన్నారు.

కొత్తకండ్రిగలో 50 మంది చేరిక

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక పంచాయతీ, కొత్తకండ్రిగ గ్రామంలో టీడీపీకి చెందిన 50 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఇందులో టీడీపీకి చెందిన రవీంద్ర నాయుడు, వెంకటయ్య, వెంకటరమణారెడ్డి, సురేష్, చెంచుబాబు, నాగభూషణం, కుమారస్వామిరెడ్డి, వెంకటమునిరెడ్డి, శ్రీనివాసులు, గురవయ్యయాదవ్, వెంకటేష్, సుబ్బయ్య, వెంకటమునిరెడ్డి, ఆనందయ్య తదితరులు ఉన్నారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ గంగాధరం, ఎంపీటీసీ భరత్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు హరినాథరెడ్డి, శంకర్, శంకరయ్య, సుబ్రమణ్యంరెడ్డి, సుబ్బరాయులు, పిచ్చయ్య, గున్నయ్య, సీపీ రమణ యాదవ్, చెంగల్‌రాయులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


భాకరాపేట : పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు పెరిగాయి. శుక్రవారం మండలంలోని దీన్‌దార్లపల్లె పంచాయతీ, తెట్టుపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, వార్డు మెంబర్లు చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు మెంబర్లు వేణుగోపాల్‌ఆచారి, బావాజీ, సైఫ్‌ఖాన్, చలపతి, టీడీపీ నాయకులు చలపతి, షరీఫ్‌ఖాన్ ఉన్నారు. మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, మాజీ సర్పంచ్ సాదిక్‌అలీఖాన్, సచివాలయ పార్టీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు వీరప్రతాప్‌రెడ్డి, వార్డు మెంబర్ జాఫర్ పాల్గొన్నారు.

టీటీడీ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం


శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ కార్డియాక్ కేర్ సెంటర్‌లో చికిత్స కోసం వచ్చిన చిన్నారులను పలకరిస్తున్న గవర్నర్


గవర్నర్ దంపతులను సత్కరిస్తున్న టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

తిరుపతి తుడా: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. తిరుపతిలోని బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రులను గవర్నర్ దంపతులు సందర్శించారు. ముందుగా బర్డ్ ఆస్పత్రిని సందర్శించి, నిరుపేదలకు ఉచితంగా మోకాలి కీళ్ల మార్పిడి, ఇతర ఎముకల సంబంధిత వ్యాధులకు అందుతున్న చికిత్స, ఐసీయూ, ఔట్‌పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, డిజిటల్ ఎక్స్‌రే, సీటీ స్కాన్, కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కేంద్రాన్ని పరిశీలించారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రి వార్డుల్లో గుండె జబ్బులతో చికిత్స పొందుతున్న చిన్నారులను, క్యాథ్‌ల్యాబ్, ఐసీయూ తదితర వార్డులను రాష్ట్ర గవర్నర్ సందర్శించారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. నిరుపేదలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసి టీటీడీ అందిస్తున్న సేవల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పేద రోగులకు అత్యుత్తమ వైద్యాన్ని అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర గవర్నర్‌ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులను టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి శాలువతో సత్కరించారు. బర్డ్ ఆస్పత్రి ప్రత్యేకాధికారి రెడ్డెప్పరెడ్డి, పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలపై విశ్వంలో అవగాహన సదస్సు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్లో ఆదివారం ఉదయం 10గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూళ్లల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలపై ఉచితంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు 4నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తితో పాటు సీట్లు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు, మెలకువలను నిపుణులు వివరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన కోరారు.

సెల్‌ఫోన్ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

చంద్రగిరి: చంద్రగిరిలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మే ఒకటి నుంచి 30 రోజుల పాటు సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు మాత్రమే శిక్షణకు అర్హులని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇస్తారని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి చిరునామాలో లేదా 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లను సంప్రదించవచ్చని వివరించారు.